# రెండు దృశ్యాలూ.. ఒక వ్యత్యాసమూ...

**మా**మా! నారాయణ మామా అన్నపిలుపు వెనకాల నుంచీ వినిపిస్తే, వెనక్కు తిరిగి చూశాను. అశేష జన సందోహం మధ్య చేయి వూపుతూ వస్తున్నాడు, మా వూరి వెంకటపతి – దగ్గరకు వచ్చీరాగానే, "ఒక ఇన్నూరు రూపాయలీ మామా! ఎరువులకు తక్కువ పడింది అన్నాడు" నేను కనిపించిన సంతోషంతో! "నీ కోసం ఇంటి కాడికే రావల్లనుకుండా! ఈడే కనపడినావు" అన్నాడు – మనిషి చాలా తొందరలో వున్నట్టుంది. అడపాదడపా నాతో ఇలా చేబదుళ్ళు తీసుకోవడం అలవాటే వాడికి! ఆ తీసుకునే బదుల్లన్నీ కూడా ఇదిగో ఇలాంటి వాటికే! ఎరువులకో, పురుగుమందులకో, ఏ వ్యవసాయం పనులకో! ఎప్పుడో వెసులుబాటు అయితే, నెమ్మదిగా తీరుస్తాడు.

విత్తనం ఏస్తావుండారా అనడిగాను, రెండు వందలు ఇస్తూ–

మొన్న చిన్న పదునయ్యింది. తేమ ఆరకముందే, ఆ యిత్తనాలు భూమిలో పోసేస్తే, ఇక దిగులు వుండదు. ఎరువు లేసుకొని సాయంత్రం బస్సుకు పోవల్ల! వస్తా మామా! అంటూ పరుగుతీస్తున్నట్టు వెళ్ళిపోయాడు వెంకటపతి.

అలా వెళ్తున్న వెంకటపతిని చూస్తుంటే దిగులు వేసింది నాకు. వెంకటపతినే కాదు, ఏ రైతును చూసినా నాకు మొదట కలిగేది దిగులే! మా వూళ్ళో వెంకటపతి లాంటివాళ్ళు కోకొల్లలు.

వెంకటపతి నాకంటే పద్దెదేళ్ళు చిన్నవాడు – వాడి బతుకు నాకు తెలుసు. వాళ్ల నాన్న నాకంటే పదేళ్ళు పెద్దవాడు. ఆయన జీవితమూ నేను పుట్టినప్పట్నుంచీ చూస్తూనే వున్నాను. వెంకటపతి తాత ఇప్పటికీ వున్నాడు కుక్కిమంచంలో. ఆయన గురించీ నాకు తెలుసు. ఆ కుటుంబంలో మూడుతరాల వ్యావసాయిక జీవితానికి చాలామందిలాగే నేనూ ఒక ప్రత్యక్ష సాక్షిని. ఆ కుటుంబ జీవితం ప్రత్యేకమైందని కాదు. మా వూళ్ళో అనేక రైతు కుటుంబాల్లో, మూడు తరాల గాథలున్నాయి. ఆ గాథల్లో వీళ్ల గాథ కూడా ఒక్కటి మాత్రమే!

వెంకటపతి తాతకు, రెండు బావుల కింద పదెకరాల భూమి వుండేది. అప్పుడంతా కపిల సేద్యమే! ఇప్పటిలాగా కరెంటింజన్లూ, గొట్టపుబావులూ వుండేవి కావు. తెల్లవారుఝామున్నే వ్యవసాయం పనులు ప్రారంభమయ్యేవి. రాత్రి పడుకునేదాకా ఇంటిల్లపాదీ అందులోనే మునిగి తేలుతుండేవాళ్ళు. మూడు కాండ్ల సేద్యం వెంకటపతి తాతది! వరి, రాగి, జొన్న పండించేవాళ్లు. తినగా మిగిలింది అమ్మితే ఏ నాలుగు రూకలో చేతికొచ్చేవి. ఇంట్లో ఎవరికీ మూడు, నాలుగు జతలకు మించి బట్టలుండేవి కావు. కాఫీలు, టిఫిన్లూ, అస్సలుండేవి కావు. జొన్న నూకలు, రాగి పిండి కలిపి చేసిన సంగటి ముద్దలే తిండి. వారానికి ఏ ఒక్కపూటో వరి అన్నం – చేతిలో డబ్బు ఆడటం గగనంగా వుండేది. పెళ్లిళ్ల లాంటి అవసరాలకు కొద్దో గొప్పో అప్పులు చేసేవాళ్ళు. కరెంటు లేదు. కిరసనాయిలు దీపాలు. ఆముదం దీపాలు. రోగాలు, రొష్టులూ వస్తే అదృష్టం కొద్దీ బతికి బయట పడాల్సిందే. పదెకరాల సేద్యం వున్నా, పెద్ద స్థితిమంతులనిపించుకోవటానికి వీల్లేని జీవితం వెంకటపతి తాతది. ఊరి చుట్టూ వేలాది ఎకరాల మెట్ట భూములున్నా, అందులో ఎక్కువ భాగం గవర్నమెంటు భూములే. రైతులకు పట్టాభూములు తక్కువ. అసలు వాటిపై ఆసక్తే తక్కువ. వేరుశనగ వేసేవాళ్లు కాని, అప్పటికది పెద్ద వాణిజ్యపంట కాదు. పోరుజాలక చేసినట్టుండే సేద్యాలు మెట్టసేద్యాలు. వెంకటపతి తాతకు ఇరవై ఎకరాల మెట్ట వున్నా, అందులో సేద్యమూ అంతంత మాత్రమే, దిగుబడీ అంతంత మాత్రమే. వెంకటపతి తాత కాలంలోనే బావులకు ఆయిలు ఇంజన్లు వచ్చాయి. వెంకటపతి తాత కూడా బావికి ఆయిల్ ఇంజన్లు వేయించాడు. దాని ఖర్చులతో సగం నడ్డి విరిగిపోయింది వెంకటపతి తాతకు. ఇంట్లో వాళ్లంతా రాత్రింబగళ్లూ కష్టపడినట్టే వుండేది. జీవితమంతా బరువుగానే ఈడుస్తున్నట్టు గడిచిపోయింది వెంకటపతి తాత తరం అంతా! ఆయన తరంలో అదనంగా ఒక ఎకరా కూడా సంపాదించుకోలేకపోయాడు.

వెంకటపతి తాతకు ఇద్దరు కొడుకులు. అప్పటికి మా వూళ్లో హైస్కూలు లేదు. ఆ కొడుకులకు చదువూ లేదు. ఆస్తి చెరిసగం పంచుకొని విడిపొయ్యారు. వెంకటపతి తండ్రి ఒక చిన్న ఇల్లు కట్టుకున్నాడు విడిపోయినాక నాలుగేళ్లకు. ఊళ్లోకి కరెంటు వచ్చింది. బావులకు కరెంటింజన్లు వచ్చాయి. వెంకటపతి తండ్రి మంచి సేద్యగాడు. మెట్టసేద్యాన్ని ఒక తపస్సులా చేశాడు. లాభదాయకంగా వేరుశనగ పంట తీసేవాడు. మెట్టలో వచ్చిన లాభం అంతా బావుల కింద సేద్యానికి జమపడిపొయ్యేది. ఒకప్పుడు

సేద్యానికి శ్రమ పెట్టుబడి అయితే, వెంకటపతి తండ్రి కాలానికి డబ్బు పెట్టుబడి అయిపోయింది. బావుల కింద పండే తిండిధాన్యాలు, తినటానికి, కూలీ నాలీ జనానికి సరిపొయ్యేవి. కరెంటింజన్ రిపేరీలూ, కరెంటుబిల్లులూ, వీటితో ఎప్పుడూ అప్పో, సప్పో చేస్తూ వున్నట్లే వుండేది. ఇద్దరు బిడ్డల పెళ్లిళ్లు చేసేసరికి వెంకటపతి తండ్రికి నడ్డి విరిగిపోయింది. వెంకటపతి ఒక్కడే కొడుకు. వాడిని వూళ్లో హైస్కూలు చదువు దాటి చదివించలేకపోయాడు. పట్టణానికి ప్రయాణపు అవసరాలు పెరిగాయి. పంటలో చేతికి డబ్బు వచ్చినట్లే వుండేది గాని, నెలదాటేసరికి మళ్లీ అప్పుల వాళ్ల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించింది వెంకటపతి తండ్రికి. వడ్డీరేట్లు రూపాయి నుండి రెండు దాకా పెరిగింది. చేబదుళ్లు పుట్టటం గగనమైపోయింది. రసాయనిక ఎరువులూ, పురుగుమందులూ వాడందే పంట దిగుబడి వుండేది కాదు. పూర్తిగా డబ్బుతో ముడిపడిపోయింది వ్యవసాయం. విందులూ, విలాసాలూ, వినోదాలూ జీవితపు దరిదాపుల్లోకి వచ్చేవి కావు. వెంకటపతి తండ్రి ఎప్పుడు ఎదురైనా ఏవో బాధలు చెప్పుకొచ్చేవాడు. అతని ముఖంలో ఎప్పుడూ దీనత్వమూ, భయమూ దోబూచులాడుతున్నట్టు కనిపించి నామనసంతా వికలమైపోయేది. వెంకటపతి తాత జీవితానికి, తండ్రి బతుక్కూ, పెద్ద అంతరం నాకెప్పుడూ కన్పించలేదు. ఇద్దరూ భూమిని మెడకు కట్టుకుని బతుకు ఈడ్చటంలో అలిసిపోయిన వాళ్లలాగా నాకెప్పుడూ కనిపించే వాళ్లు.

వెంకటపతి సేద్యంలోకి దిగినాక వాడికెక్కడాలేని కష్టాలు వచ్చిపడ్డాయి. రోజూ చేతుల్లో డబ్బు ఆడితే తప్ప సేద్యం ఒక్క అడుగు కూడా ముందుకు సాగని తరంలో వాడిప్పుడున్నాడు. వాడిప్పుడు వాణిజ్య బ్యాంకుల చుట్టూ, తనఖాబ్యాంకుల చుట్టూ, సొసైటీ బ్యాంకు చుట్టూ పరిభ్రమిస్తూ వున్నాడు. వీటికి తోడు ఎమ్మార్వో ఆఫీసూ, ఎండిఓ ఆఫీసులు కూడా వాణ్ణి తన చుట్టూ తిప్పుకుంటున్నాయి. కూలి మనుషులు దొరకటం గగనమైపోయింది. సేద్యం పనులకు బాడుగ ట్రాక్టర్లు కావాలిప్పుడు. ఇంట్లో పశువులను మేపే స్థోమత లేదు వాడికి. వ్యవసాయ పనులు లేనప్పుడు కూడా వాడు క్షణం తీరికగా వుండటం లేదు. నెలకు పది రోజులు అనంతపురంలో దర్శనమిస్తున్నాడిప్పుడు వాడు. ఏమిరా అంటే పనులన్నీ లిస్టులా అప్పచెప్తాడు. ఇంతకు మునుపైతే రెక్కాడితే గాని డొక్కాడదు అని సామెత వుండేది. ఇప్పుడు చేతుల్లో డబ్బాడితే గానీ డొక్కాడే పరిస్థితి లేదు. ఆ శనక్కాయ పంట చూస్తే ఒక

సంవత్సరం మంచి దిగుబడి వస్తే, రెండేళ్లు పెట్టుబడి కూడా గిట్టటం లేదు. బావి కింద వున్న ఐదెకరాల్లో రెండెకరాలు చౌడు తేలి కంపచెట్లు పడ్డాయి. బావి ఎండిపోయింది. గొట్టపు బావి వేయించుకున్నాడు. దానికి సబ్‌మెర్సిబుల్ ఇంజన్ ఫిటప్పు చేయించాడు. అందులో వచ్చే పంటల గురించి చెప్పుకోకుండా వుండటమే మంచిది. వాడిప్పుడు నిండా అప్పుల వూబిలో కూరుకుపోయి వున్నాడు. అయినా వాడి ధైర్యం తెగువ చూస్తుంటే అబ్బురపడిపోతుంటాను నేను. గత రెండు తరాల కరువుభారాన్ని నెత్తిన మోపుకోవటంతోపాటు, ఇప్పుడు అదనంగా అనుభవిస్తున్న కొత్త కష్టాల భారం, వాణ్ణి ఇప్పటికే యవ్వనసౌందర్యాన్ని పీల్చేసి, వృద్ధుడిగా మార్చేసింది.

వెంకటపతి ఆలోచనల్లో పడి నడుస్తున్న నేను, క్లాక్‌టవర్ దగ్గర ఒక మోటారుబైకు ఆగటంతో, తలెత్తి నిటారుగా చూశాను. మోటారుబైకు మీద రామసుబ్బయ్య కూచొని “ఏమన్నా! తల నేల మీద పెట్టి నడుస్తుండావే. నా దిక్కుచూడు” అన్నాడు. ఒరే ఒరే రామసుబ్బా! నువ్వా అన్నాను పల్కరింపుగా! వాడూ మా వూరి వాడే! సరిగ్గా వెంకటపతి ఈడే వాడిది! నాలుగు కుశల ప్రశ్నలైం తర్వాత వాడు ఒక ఆహ్వాన పత్రిక లాంటి ఒక కవరు తీసి నాచేతికిచ్చాడు. తీసి చదివాను. రేపు శ్రీరామా షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం. అది వాడిదే అని గ్రహించటానికి నాకు ఎక్కువ సమయం పట్టలేదు. రేపుపొద్దున్నే స్కూలుకు, సెలవుపెట్టిరాన్నా అని హెచ్చరించి వాడు వెళ్ళిపోయాడు. రామసుబ్బడిని తలుచుకుంటే, నాకెక్కడ లేని ఆశ్చర్యం, విడ్డూరం కలుగుతుంటుంది. వాళ్ల నాన్న తరానికి నాలుగెకరాలు కూడా లేని సుబ్బడిప్పుడు అనంతపురంలో లీడింగ్ బిజినెస్‌మాగ్నెట్. వాడి నాన్న నాకిప్పటికీ బాగా గుర్తు. పొలంలో పొగాకు పండించి, దాన్ని నెత్తిన పెట్టుకుని సంత సంతకూ వెళ్లేవాడు. వాళ్ల నాన్న వెంట వీడు కట్లపొడిగంప, తూకం రాళ్లు మోసుకుంటూ వెళ్లేవాడు. దరిద్రంగా వుండేది వాళ్ల బతుకు. వీడికి ఎక్కడి నుండి తెలివి తేటలు పుట్టుకొచ్చాయో గాని వ్యవసాయం నుండి పూర్తీ బయటపడి, వున్న ఆ నాలుగెకరాలూ అమ్మేసి చిన్నపాటి కిరాణా కొట్టును మా వూళ్లోనే ప్రారంభించాడు. నాలుగైదేళ్లు దాటకుండానే వీడి వ్యాపారం అనంతపురానికి విస్తరించింది. రెండు లారీలు పెట్టి బాడుగకు తిప్పేవాడు. కర్ణాటకకు బియ్యం ఎక్స్‌పోర్టు చేసేవాడు.

కార్పొరేషన్ పెట్టి, ఐదేళ్లు తిరక్కుండానే ఒక పెద్ద బిల్డింగ్ కట్టిపడేసి, రెండు పెద్ద ఆఫీసులకు పదివేలకు బాడుగకు ఇచ్చుకున్నాడు. ఇప్పుడు చూస్తే ఒక పెద్ద షాపింగ్

కాంప్లెక్స్. వాడి ఆస్తిపాస్తులిప్పుడు కనీసం యాభైలక్షలకు తక్కువుండదు. ఎనిమిదో తరగతి దాకా చదువుకున్నాడంతే. నేల మీద ఎప్పుడూ నడవడు. ధగధగా మెరిసే, గంజి పెట్టిన ఖద్దరు దుస్తుల్లో మెరిసిపోతూ వుంటాడు. వీడి దగ్గర వెంకటపతి పదివేలు అప్పు తీసుకుంటే, దాన్ని తీర్చే విషయంలో గొడవలొస్తే పెద్ద పంచాయితీ పెట్టించి, ఆ పంచాయితీకి నన్ను కూడా పిలిచాడు వీడు. ఈ మధ్యనే మెల్లగా రాజకీయాల్లోకి అడుగు మోపుతున్నట్టుంది వీడు. రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతూ కాంట్రాక్టులు కూడా సాధిస్తున్నాడు. నా ఆలోచనల్లో ఒక పక్క వెంకటపతీ, మరో పక్క రామసుబ్బుడూ మెదులుతుంటే అలాగే నిల్చుండిపోయి, నాకు కన్పించిన, రెండు దృశ్యాలకూ మధ్య గల ఒక వ్యత్యాసాన్ని పట్టుకోవటానికి, ఏదైనా ఆధారం దొరుకుతుందా అని అన్వేషణలో పడిపోయాను.

**❖ ఆంధ్రభూమి, 2000**